●తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ●మార్కెట్‌లో డిమాండే కారణం

# విస్తరిస్తున్న 'ఆరుతడి'

మొఘలో సాగవుతున్న శనగ పంట


డోంగ్లీ, డిసెంబర్ 5: మండలంలో ఆరుతడి పంటల సాగు రోజురోజుకూ విస్తరిస్తున్నది. మార్కెట్‌లో వీటికి డిమాండ్ ఉండడమే ప్రధాన కారణం. మండల రైతులు ఎక్కువగా జొన్న, శనగ, పొద్దు తిరుగుడు, మినుము, కంది పంటలను సాగుచేశారు. పత్తి, వరి పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు ఎక్కువ. వరికి నీటి తడులు కూడా ఎక్కువగా అవసరం ఉంటాయి. దీంతో రైతులు ఆరుతడి పంటలను సాగుచేయడానికే ఆసక్తిని చూపుతున్నారు. పైగా ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయాధికారులు కూడా ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో సాగు నీటి లభ్యత కూడా తక్కువగా ఉండడంతో పప్పు దినుసులను ఎక్కువగా సాగుచేశారు. ఆరుతడి పంటలను సాగుచేస్తుండడంతో ఎకరానికి రూ.45వేల వరకు ఆదాయం వస్తుండడంతో అన్నదాతలు వాటి సాగుకే ఆసక్తిని చూపుతున్నారు.


మారేపల్లిలో రైతులు సాగుచేస్తున్న కంది


డోంగ్లీలో సాగవుతున్న మినుము


లింబూర్‌లో ఏపుగా పెరిగిన జొన్న పంట

## విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

తాడ్వాయి, డిసెంబర్ 5: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఎంఈవో రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ పాఠశాలకు వస్తున్న విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం రావాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సంగారెడ్డి, కళ్యాణి, రమేశ్, సీఆర్పీలు పాల్గొన్నారు.


ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రామస్వామి

## 8న మండల సర్వసభ్య సమావేశం

తాడ్వాయి, డిసెంబర్ 5: మండల సర్వసభ్య సమావేశాన్ని 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ కౌడి రవి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జడ్పీటీసీ, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు. అధికారులు తమ శాఖల పూర్తి నివేదికలతో రావాలని సూచించారు.

## నిజాంసాగర్‌లో కుక్కల బెడద

నిజాంసాగర్, డిసెంబర్ 5: నిజాంసాగర్‌లో కుక్కలు వందల సంఖ్య లో రహదారులపై సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నాయి. దీంతో రోడ్లపైకి రావాలంటేనే చిన్న పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు. నిజాంసాగర్‌లో ఇటు గ్రామ సింహాలు, అటు కోతులు, పందులు సంచరిస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కుక్కల దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ సింహాలతో పాటు కోతులు, పందుల బెడద తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.



నిజాంసాగర్‌లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

## అయ్యప్ప మాలధారుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న మాలధారులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 5: ఎల్లారెడ్డిలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి డిసెంబర్ 1వ తేదీన పలువురు మాలధారులు శబరిమలకు పాదయాత్రగా బయల్దేరారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పది మంది అయ్యప్ప మాలధారులు శబరి యాత్ర ప్రారంభించారు. పాదయాత్ర మంగళవారం నాటికి రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చేరినట్లు వారు తెలిపారు. జనవరి 11వ తేదీన శబరిమల సన్నిధానానికి చేరుకుంటామని అన్నారు. ప్రతి రోజూ 30 నుంచి 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు.

## మక్కజొన్న పంటను పరిశీలించిన వ్యవసాయాధికారి

గాంధారి, డిసెంబర్ 5: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో పామాయిల్ పంటలో అంతర్ పంటగా రైతులు సాగు చేస్తున్న మక్కజొన్నను మండల వ్యవసాయాధికారి నరేశ్ మంగళవారం పరిశీలించారు. పంటపై మొగి పురుగు ఆశించినట్లు గుర్తించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో పురుగు ఆశించిందని అన్నారు. మొగి పురుగు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ మందులను పిచికారీ చేయాలని సూచించారు.


తిమ్మాపూర్‌లో మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో నరేశ్

***కంది, శనగకు పచ్చపురుగు బెడద..***

బిచ్కుంద, డిసెంబర్ 5: రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉన్నది. దీంతో చలి ఎక్కువ పెట్టి కంది,శనగ పంటలకు పచ్చ పురుగు ఆశిస్తున్నదని రైతులు వాపోతున్నారు. పంట చేతికి అందుతున్న తరుణంలో అన్నదాతలకు నిరాశ మిలుగుతున్నది. ఆకాశం మబ్బులు పట్టడంతో పంటలకు పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పచ్చ పురుగు ఆశించడంతో పంటలో ఎదుగుదల మందగిస్తున్నదని తెలిపారు.

## జక్కాపూర్‌లో అయ్యప్ప మహాపడి పూజ


పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

నిజాంసాగర్, డిసెంబర్ 5: మండలంలోని జక్కాపూర్ గ్రామంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పడిపూజలో నిజాంసాగర్, పిట్లం, ఎల్లారెడ్డి, బాన్సువాడ, సంగారెడ్డి జిల్లాలోని బాచేపల్లి, మాసాన్‌పల్లి తదితర గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప నామ సంకీర్తనలతో గ్రామం మార్మోగింది. అనంతరం 18 మెట్ల పూజ, అభిషేకాలు, భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్‌గౌడ్ స్వామి, గురుస్వాములు సంగమేశ్వర్‌గౌడ్, అమర్‌సింగ్, చంద్రం పాల్గొన్నారు.

## విగ్రహాలకు తొలగని ముసుగులు

గాంధారి, నవంబర్ 5: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద దేశ నాయకుల విగ్రహాలపై ముసుగులు కప్పారు. ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడి, ఎన్నికల నిబంధనలు తొలిగినా.. అధికారులు ముసుగులను ఇంకా తొలిగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విగ్రహాల ముసుగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


గాంధారిలో ఓ విగ్రహానికి ఉన్న ముసుగు